క్లుప్తంగా

నేడు, రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చాగల్లు: స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు నిర్వహిస్తుండడంతో మంగళ, బుధవారాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ ఈఈ(ఆపరేషన్) బి.వీరభద్రరావు తెలిపారు. చాగల్లు, నెలటూరు, మీనానగరం తదితర గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఆయన తెలిపారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



మీనానగరంలో ఆర్‌బీకే భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న వైస్ ఎంపీపీ

చాగల్లు: రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని మండల పరిషత్ ఉపాధ్యక్షులు జుజ్జవరపు రామచంద్రరావు అన్నారు. స్థానిక సచివాలయ పరిధిలో మీనానగరంలో నిర్మిస్తున్న రైతుభరోసా కేంద్రం పనులను సోమవారం ఆయన పరిశీలించారు. భవనం పనులు దాదాపు పూర్తయ్యాయని, త్వరలో మంత్రి తానేటి వనిత చేతుల మీదుగా ప్రారంభించనున్నట్టు ఆయన తెలిపారు. సచివాలయం కన్వీనర్లు గంగవరపు రాజేంద్రప్రసాద్, బోర్రా రజనీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దళిత ఉద్యోగుల సంక్షేమమే 'మేడ్' ప్రధాన లక్ష్యం

నిడదవోలు రూరల్: దళిత ఉద్యోగుల సంక్షేమం, అభివృద్ధే మోడల్ అసోసియేషన్ ఆఫ్ దళిత ఎంప్లాయీస్ (మేడ్) ప్రధాన లక్ష్యమని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.శామ్యూల్ అన్నారు. నిడదవోలు టౌన్ హాల్‌లో ఆదివారం మేడ్ జిల్లా సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు టెక్కెం నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో దళిత ఉద్యోగుల సమస్యలపై చర్చించి వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన అంశాలపై మాట్లాడారు. అనంతరం నియోజకవర్గ నూతన అధ్యక్షుడిగా గెడ్డం రాజు, ప్రధాన కార్యదర్శిగా లక్ష్మీశ్రీనివాస్‌లను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కృష్ణంరాజు, ఉండుర్తి సుబ్బారావు, ముప్పిడి రవికుమార్, పి.రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

20న వాహనాల వేలం

కొవ్వూరు: సారా, ఇతర కేసుల్లో పట్టుకున్న ద్విచక్ర వాహనాలకు ఈనెల 20వ తేదీన కొవ్వూరు ఎస్ఈబీ కార్యాలయం వద్ద వేలం నిర్వహించనున్నట్టు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ వీటీవీ సత్యనారాయణ తెలిపారు. వేలంలో పాల్గొనే వారు రూ.5 వేలు ధరవత్తు చెల్లించాలన్నారు. వేలం దక్కించుకున్న తర్వాత మొత్తం సొమ్ముతోపాటు 18 శాతం జీఎస్టీ చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలకు 94409 02430 నంబర్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.

బాధితులకు ఆర్థిక సాయం



అనంతపల్లిలో అనారోగ్య బాధితులకు ఆర్థిక సాయం అందజేస్తున్న మానవత సభ్యులు

నల్లజర్ల: అనంతపల్లిలో పెనుమాక ప్రసాద్, కొండ్రు అప్పన్న, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అబ్బదాసరి వెంకటేశ్వరావులకు ఒక్కో కుటుంబానికి రూ.4 వేల చొప్పున ముగ్గురికి రూ.12 వేలను వైద్య ఖర్చుల నిమిత్తం మానవత ఆర్థిక సాయం అందజేసింది. ఈ మొత్తాన్ని ఆయా కుటుంబాలకు మానవత సభ్యులు అందజేశారు. కార్యక్రమంలో మానవత చైర్మన్ భోగవల్లి వెంకటసుబ్బారావు, మండల శాఖ అధ్యక్షుడు ఐడీవీ అప్పారావు, జిల్లా ట్రెజరర్ గుళ్లపూడి వెంకటరత్నం, పాతూరి సత్యనారాయణ, నందం రాజేంద్రప్రసాద్, ఓలిరెడ్డి సతీష్, మద్రి మహేష్, కనుమూరి ప్రసాద్, కుమ్మరిశ్రీను, అడబాల రంగారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దీపావళి

చాగల్లు: దీపావళి వేడుకలను మండలంలో ప్రజలు ఆనందంగా జరుపుకొన్నారు. సాయంత్రం లక్ష్మీదేవికి పూజలు చేసి, దీపాలు వెలిగించారు. సాంప్రదాయబద్ధంగా దివిటీలు కొడుతూ, టపాసులు కాల్చారు. చిన్నా పెద్దా అంత సందడి చేశారు. ఆదివారం చాగల్లు, మీనానగరం, బ్రాహ్మణగూడెం, ఊనగట్ల తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాల వద్ద జనం క్యూ కట్టారు.

తాళ్లపూడి/నిడదవోలు: మండలంలో దీపావళి పండగను ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించుకున్నారు. ప్రతి ఇంటా దీపాల వెలుగులు విరజిమ్మాయి. అన్ని గ్రామాల్లో సాయంత్రం ప్రతి ఇంటి ముందు ప్రమిదలు వెలిగించి, టపాసులు పేల్చి ఆనందంగా గడిపారు. కొందరు దివిటీలు కొట్టారు.

వృద్ధులకు రగ్గుల పంపిణీ

రాజమహేంద్రవరం రూరల్: అంతర్జాతీయ దయాగుణం దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫిలాంత్రోఫిక్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సోమవారం బొమ్మూరు మురళీ కొండపై గల రూత్ వృద్ధాశ్రమంలో వృద్ధులకు రగ్గులు, పండ్లు వితరణ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు (బాబు) మాట్లాడుతూ ఫిలాంత్రోఫిక్ సొసైటీ ద్వారా చేస్తున్న కార్యక్రమాలను అభినందించారు.

కార్తికం.. ఆధ్యాత్మిక శోభితం

- నేటి నుంచి ప్రారంభం
- ఆలయాల్లో పూర్తయిన ఏర్పాట్లు
- భక్తుల కోసం అన్ని వసతులు



సమిశ్రగూడెం గీతామందిరం ప్రాంగణంలో జరిగిన కార్తిక దీపోత్సవంలో పాల్గొన్న భక్తులు (ఫైల్)

నిడదవోలు రూరల్: హరిహరులకు ఎంతో ప్రీతికరమైన కార్తిక మాసం మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. ఈ మాసంలో దీపారాధనకు విశేష ప్రాధాన్యం ఉంది. కార్తిక మాసోత్సవాల నిర్వహణకు జిల్లా వ్యాప్తంగా ఆలయాలతో పాటు నదులు, కాలువలు, రేవులు, పుష్కరిణుల వద్ద అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. స్నానం, దానం, దీపారాధన చేయడం సాంప్రదాయంగా వస్తుంది. శివ ప్రీతికై అభిషేకం, విష్ణు ప్రీతికై తులసీ దళార్చన చేసేందుకు శైవక్షేత్రాలు సిద్ధమయ్యాయి. నిడదవోలులోని పురాతన గోలింగేశ్వరస్వామి, సోమేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. చిన కాశీరేవులో భక్తులు స్నానమాచరించటానికి మున్సిపల్ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నిడదవోలు మండలం సమిశ్రగూడెంలోని పర్వతవర్ధిని ఉమా రామలింగేశ్వరస్వామి, కాటకోటేశ్వరంలో ఉమాకాటకూటేశ్వర లింగేశ్వరస్వామి, కంసాలిపాలెం అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి శివ పంచాయతన ఆలయాలతో పాటు విజ్జేశ్వరం, పందలపర్రు, తాడిమళ్ల, పెరవలి మండలం మల్లేశ్వరం, అన్నవరప్పాడు, తీపర్రు, ముక్కామల, కానూరు అగ్రహారం, ఉండ్రాజవరం మండలం పాలంగిలోని ప్రముఖ శివాలయాల్లో అధిక సంఖ్యలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

వనసమారాధనల సందడి

కార్తిక మాసంలో పుణ్యస్నానాలతో పాటు గోదావరి తీరంలో భక్తులు, యువత ఉత్సాహంగా కార్తిక వన సమారాధనలు నిర్వహిస్తారు. నిడదవోలు మండల పెండ్యాల, జీడిగుంట, పందలపర్రు, తీపర్రు ఇసుక ర్యాంపుల సమీపంలోని పలు అందమైన ప్రదేశాలతో పాటు గోదావరి గట్టు వెంబడి పచ్చటి పొలాల మధ్య ఈ వనసమారాధనలు జరుగుతాయి. అయితే యువత జాగ్రత్తలు పాటించాలని, స్నానాలు చేసేటప్పుడు గోదావరి లోపలికి వెళ్లొద్దని పోలీసులు హెచ్చరిస్తున్నారు. తీరంలో స్నానాల రేవుల వద్ద భక్తులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తామని ఎంపీడీఓ పి.శామ్యూల్ తెలిపారు.



కాటకోటేశ్వరంలో ఉమా కాటకూటేశ్వర లింగేశ్వరస్వామి

తాళ్లపూడి: మండలంలోని శివాలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజామునే గోదావరి నదిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి ఆలయాల్లో పూజలు నిర్వహించారు. మండలంలోని వేగేశ్వరపురంలోని ఛాయసోమేశ్వరస్వామి ఆలయంలోను, తాళ్లపూడిలోని ఉమామహేశ్వర స్వామి ఆలయం, ప్రక్కిలంకలోని పార్వతి సహిత విశ్వేశ్వరస్వామి ఆలయంలోను, అన్నదేవరపేట సంగమేశ్వరస్వామి ఆలయంలోను ప్రత్యేక పూజలు నిర్వహించారు. బల్లిపాడు, పెద్దేవం, మలకపల్లి ఆలయాల్లోను శివునికి ప్రత్యేక అభిషేకాలు చేశారు.

బాలల హక్కుల పరిరక్షణ పోస్టర్ ఆవిష్కరణ



కొవ్వూరు మంత్రి క్యాంపు కార్యాలయంలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి వనిత

కొవ్వూరు: పట్టణంలో మంత్రి క్యాంపు కార్యాలయంలో బాలల హక్కుల వారోత్సవాల పోస్టర్‌ను సోమవారం హోమ్ మంత్రి తానేటి వనిత ఆవిష్కరించారు. ఈ నెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకూ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యులు డాక్టర్ రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా హోమ్ మంత్రి వనిత మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణ కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధిద్దాం బాలల హక్కులు పరిరక్షిద్దాం అనే నినాదంతో అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు రాజేంద్రప్రసాద్ మంత్రికి సూచించారు.

నిడదవోలు పట్టణంలో..

నిడదవోలు రూరల్: రోటరీక్లబ్ ఆఫ్ నిడదవోలు ఆధ్వర్యంలో పట్టణంలోని ఒక ప్రైవేట్ స్కూల్‌లో బాలల దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, ఆటల పోటీలను నిర్వహించి క్లబ్ సభ్యుడు పొన్నా సుబ్రహ్మణ్యం ఆర్థిక సహాయంతో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కీర్తి ఆంజనేయులు, కార్యదర్శి గుంటుపల్లి శివకుమార్, సభ్యులు గోపిరెడ్డి శ్రీనివాస్, కాళ్ల రాంబాబు, గొన్నాబత్తుల రామారావు, కొత్తపల్లి నాగేశ్వరరావు, కంఠమని గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకూ సంక్షేమం



పెనకనమెట్టలో పథకాలు వివరిస్తున్న మంత్రి వనిత, ఎమ్మెల్సీ కౌరు శ్రీనివాస్

- హోమ్ మంత్రి తానేటి వనిత
- గ్రామాల్లో గడపగడపకూ మన ప్రభుత్వం

కొవ్వూరు: కుల, మత, రాజకీయలకు అతీతంగా గడప గడపకూ వెళ్లి అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని రాష్ట్ర హోమ్ మంత్రి తానేటి వనిత పేర్కొన్నారు. సోమవారం దొమ్మేరు జగనన్న కాలనీ, పెనకనమెట్ట గ్రామంలోను గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మంత్రి వనిత ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేకూర్చిన లబ్ధిని వివరించారు. వారి సమస్యలను తెలుసుకొని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అర్హులందరికీ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్‌దేనని అన్నారు. చంద్రబాబు హయాంలో నాయకులు ఎంపిక చేసిన వారికి మాత్రమే పథకాలు అందాయన్నారు. ఇప్పుడు నేరుగా నిధులు లబ్ధిదారుల ఖాతాకే చేరుతున్నాయన్నారు. అన్నీ వర్గాల శ్రేయస్సు కోసం నిరంతరం శ్రమిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాల ని ప్రజలను కోరారు. ఎమ్మెల్సీ కౌరు శ్రీనివాస్, మాజీ ఏఎంసీ చైర్మన్ బండి పట్టాభి రామారావు, మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, జెడ్పీటీసీ సభ్యురాలు బొంతా వెంకటలక్ష్మి, జెడ్పీ వైస్ చైర్ పర్సన్ పోసిన శ్రీలేఖ, చింతలపూడి నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు గుణ్ణం నాగబాబు, మాజీ సొసైటీ అధ్యక్షుడు ముదునూరి నాగరాజు, మండల పార్టీ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, మండల గౌరవ అధ్యక్షుడు గన్న మని వెంకట్రాజు, వెంపాటి సురేష్,జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బూరుగు పల్లి సుబ్బారావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ తాగునీరు

- జగనన్న కాలనీల్లో బోర్ల ఏర్పాటు
- ముమ్మరంగా పనులు



చిట్యాల జగనన్న కాలనీలో బోరు వేస్తున్న సిబ్బంది

గోపాలపురం: జగనన్న కాలనీల్లో తాగునీటి బోర్లు ఏర్పాటు చేస్తున్నారు. పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. కాలనీ వాసుల కోసం రూ.3.07 కోట్లల వ్యయంతో 39 లేఅవుట్లలో 12 గ్రామాలకు బోర్లు, పైపులైన్లు వేస్తున్నారు. మండలంలోని గుడ్డిగూడెం, కరగపాడు, వేళ్లచింతలగూడెం, గంగోలు, గోపాలపురం, సగ్గొండ, కోమటికుంట, చిట్యాల, భీమోలు, వాదాలకుంట, రాజంపాలెం, దొండపూడి గ్రామాల్లోని జగనన్న లేఅవుట్లలో పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే సుమారు 10 గ్రామాల్లో బోర్లు వేశారు. ముఖ్యమంత్రిగా పదవీ ప్రమాణ స్వీకారం చేపట్టిన వెంటనే జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల్లో భాగంగా పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చారు. ఆయా గ్రామాల్లో ఇళ్ల నిర్మాణంగా వేగంగా జరుగుతోంది. జగనన్న కాలనీలలో ఇళ్ల నిర్మాణం, మౌలిక వసతులతో నూటికి నూరుశాతం అమలు చేసినట్లు ప్రజాప్రతనిధులు పేర్కొంటున్నారు.

శరవేగంగా పనులు



మండలంలోని 12 గ్రామాల్లో కేటాయించిన జగనన్న కాలనీల్లో విద్యుత్, తాగునీరు, రోడ్ల నిర్మాణాలకు ఏర్పాట్లు పూర్తి చేశాం. లేఅవుట్లు శరవేగంగా జరుగుతున్నాయి. గోపాలపురం లేఅవుట్ నిర్మాణానికి సంబంధించి కలెక్టర్ ఉత్తర్వుల మేరకు స్థలం మార్పిడి అనంతరం మౌలిక వసతులు కల్పించి నిర్మాణాలు చేపడతాం. ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఇంటి నిర్మాణాలపై ప్రభుత్వం నూరు శాతం శ్రద్ధం తీసుకుంటోంది.
– పీవీ అజయ్‌బాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

ఆర్టీసీ బస్సు ఢీకొని విరిగిన గడ్డర్లు



కొవ్వూరు టోల్‌గేట్ వద్ద విరిగిన గడ్డర్లు

కొవ్వూరు: రోడ్డు కం రైలు వంతెనపై భారీ వాహనాలు వెళ్లకుండా ఉండేందుకు ఏర్పాటు చేసిన గడ్డర్లు ఆర్టీసీ బస్సుపై ఉండే క్యారీయర్ స్టాండ్ ఢీకొట్టడంతో విరిగిపోయింది. సోమవారం జంగారెడ్డిగూడెం డిపోకి చెందిన పల్లెవెలుగు బస్సు పట్టణంలో టోల్‌గేట్ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన గడ్డర్లను ఢీకొట్టింది. బస్సుపై క్యారీయర్స్ ఏర్పాటు చేయవద్దని ఇప్పటికే రోడ్డు కం రైలు బ్రిడ్జి (ఆర్‌సీఆర్‌బీ) అధికారులు చెబుతున్నారు. ఈ గడ్డర్లు ఏర్పాటు కోసం రూ.1.20 లక్షల వరకూ ఖర్చుయినట్లు అధికారులు చెబుతున్నారు. బస్సుపై ఉండే క్యారీయర్ స్టాండ్ తగడంతో గడ్డర్లపై భాగం ఊడిపోయి కింద పడింది. దీంతో ఆర్టీసీ అధికారులు, ఆర్అండ్‌బీ అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని విరిగిన గడ్డర్లను పరిశీలించారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు చొరవ తీసుకుని బస్సుపై క్యారీయర్ స్టాండ్ లేని పల్లె వెలుగు బస్సులను మాత్రమే నడిపేలా చర్యలు తీసుకోవాలని ఆర్‌సీఆర్‌బీ డీఈఈ బీవీ మధుసూదనరావు కోరారు.

ప్రతి వ్యక్తి బాధ్యతతో మెలగాలి



విశ్రాంత ఉద్యోగి కోరా కన్నయ్య దంపతులను సత్కరిస్తున్న మానవత సభ్యులు

నల్లజర్ల: సమాజంలో ప్రతి వ్యక్తి సామాజిక బాధ్యతతో మెలగాలని మానవత జిల్లా అధ్యక్షులు తాడేపల్లి మోహనరావు అన్నారు. నల్లజర్లలో విశ్రాంత ఉద్యోగి కోరా కన్నయ్య, రాజేశ్వరి దంపతులను సోమవారం ఘనంగా సత్కరించారు. వారి కుమారుడు వంశీరామ్ అమెరికాలో స్థిరపడ్డా భారతదేశంలో మన ప్రాంత పేద విద్యార్థులకు ఫీజులు చెల్లించి ఉన్నత చదువులకు చేయూత నిస్తున్నారన్నారు. ఎంతో మందికి ఆర్థిక సాయంతో చేసిన వంశీరామ్ తల్లిదండ్రులను సత్కరిస్తున్నట్టు ఆయన వెల్లడించారు. జిల్లా మాజీ అధ్యక్షులు రామిశెట్టి గంగాధరరావు, జిల్లా సమన్వయకమిటీ అధ్యక్షుడు కండెపు వెంకటసూర్యనారాయణ, భోడవల్లి వెంకటసుబ్బారావు, మండలశాఖ అధ్యక్షులు ఐడీవీ అప్పారావు, మద్దిపాటి ప్రసాద్, పాతూరి సత్యనారాయణ, అల్లాడరామకృష్ణ, ఉన్నమట్ల వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి రెండు ఆవుల మృతి



ఆవు మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

ద్వారకాతిరుమల: వెంకటకృష్ణాపురంలో విద్యుదాఘాతానికి గురై రెండు ఆవులు సోమవారం తెల్లవారు జామున మృతి చెందాయి. వివరాల ప్రకారం .. గ్రామానికి చెందిన కౌలు రైతు గెడ్డం రవీంద్ర తన ఆవులు, గెదెలను రోజులాగే గ్రామ శివారులోని పామాయిల్ తోటలో ఆదివారం సాయంత్రం కట్టివచ్చేశాడు. తెల్లవారు జామున ఒక విద్యుత్ స్తంభం వద్ద షార్ట్ సర్క్యూట్ సంభవించడంతో రెండు పాడి ఆవులు విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాయి. దాంతో రైతు రవీంద్ర బోరున విలపించాడు. విషయం తెలుసుకున్న గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఘటన స్థలానికి చేరుకుని, బాధిత రైతును పరామర్శించారు. అలాగే ప్రమాదానికి గల కారణాలను విద్యుత్‌శాఖ ఏఈ నరసింహస్వామిని అడిగి తెలుసుకున్నారు. ఒక్కో ఆవు ధర రూ.80 వేల వరకు ఉంటుందని, రైతుకు పూర్తి స్థాయిలో నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా వెంకన్నబాబుతో కలసి బాధిత రైతుకు రూ.10 వేల ఆర్థిక సాయం ఎమ్మెల్యే అందించారు. అనంతరం మండల పశువైద్యాధికారి అంగర సురేష్ ఆవులకు పోస్టుమార్టం నిర్వహించారు. ఎమ్మెల్యే తోపాటు జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, వైఎస్ ఎంపీపీ యలమర్తి దుర్గాదేవి, ఘంటా విఘ్నేశ్వరరావు, యలమర్తి గాంధి, యలమర్తి భాస్కరచౌదరి, గెడ్డం దేవానందరావు తదితరులు ఉన్నారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

నల్లజర్ల: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ శాఖ గ్రంథాలయంలో ఈ నెల14వ తేదీ నుంచి 20వ తేదీ వరకూ 56వ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు గ్రంథాలయ పాలకురాలు ఏవీరమణ తెలిపారు. 14న ప్రారంభ వేడుకలు, 15 నుంచి 20వ తేదీ వరకూ పుస్తక ప్రదర్శన, వివిధ అంశాలపై అవగాహన, 16న అయ్యంకి వెంకట రమణయ్య సంస్మరణ కార్యక్రమం ఉంటాయన్నారు. 17న సదస్సులు, సందేశాలు, 18న చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు, 19న దిశ చట్టం, మహిళా సాధికారితపై చర్చ, 20 డిజిటల్ గ్రంథాలయాలపై అవగాహన, విజేతలకు బహుమతి ప్రదానం వంటి కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

నిడదవోలు: నిడదవోలు శాఖ గ్రంథాలయంలో నిర్వహించే 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతం చేయాలని 5వ వార్డు కౌన్సిలర్ కొత్తపల్లి సుప్రియ కోరారు. స్థానిక శాఖా గ్రంథాలయం వద్ద వారోత్సవాల పోస్టర్‌ను ఆదివారం ఆమె ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ గ్రంథాలయాధికారి కుందుల ప్రభాకరం, చర్ల సుశీల వృద్ధాశ్రమ నిర్వాహకురాలు మృదుల, ఉయ్యూరు ప్రసాద్, దడల శ్రీనివాసరావు, గ్రంథాలయాధికారి కుంచె చినబాబు తదితరులు పాల్గొన్నారు.

18న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

నిడదవోలు రూరల్: నిడదవోలు మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 18వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ పి.శామ్యూల్ సోమవారం తెలిపారు. సమిశ్రగూడెం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. అధికారులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు సమావేశానికి విధిగా హాజరుకావాలని ఆయన కోరారు.

ప్యాకేజీ కోసమే విశ్వరూప సభ

దేవరపల్లి: ప్యాకేజీ కోసం మందా కృష్ణ మాదిగ విశ్వరూప సభ పెట్టి రూ.100 కోట్లకు బీజేపీకి మాదిగ జాతిని తాకట్టుపెట్టారని ఏపీ ఎమ్మార్పీఎస్ సమన్వయ కర్త కొడవటి బుజ్జిబాబు మాదిగ ఆరోపించారు. సోమవారం ఆయన దేవరపల్లిలో ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణా రాష్ట్రంలో ఎన్నికలు జరుగుతున్న సమయంలో మందా కృష్ణ మాదిగ బీజేపీతో కుమ్మక్కై ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా ప్రత్యేక రైళ్లు, వాహనాలు పెట్టి జనాలను తరలించి మాదిగల పేరుతో పెట్టిన సభ మోదీమయ సభగా మార్చేశారని అన్నారు. విశ్వరూప సభ వేదికపై గుక్కనపెట్టి ఏడ్చి అవసరానికి మించి మోదీని పొగిడిన మందా కృష్ణ మాదిగ రానున్న శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ఎందుకు పెట్టమని అడగలేదని ఆయన ప్రశ్నించారు. విశ్వరూప సభలో 30 ఏళ్ల ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో మాదిగలను అన్ని రాజకీయ పార్టీలు మోసం చేశాయన్న ప్రధాని మోదీ బీజేపీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే పార్లమెంట్‌లో బిల్లు పెడతామని చెప్పి అధికారంలోకి వచ్చి పదేళ్లు గడుస్తున్నా ఎందుకు చట్టం చేయలేదని ఆయన నిలదీశారు. శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించే బాధ్యత మోదీదేనని డిమాండ్‌తో ఈ నెల 30న చలో విజయవాడ కార్యక్రమం తలపెట్టినట్టు ఆయన తెలిపారు. మాదిగ, రెల్లి, డక్కలి, ఉపకులాల యుద్ధభేరీ మహాసభకు వేలాదిగా తరలిరావాలిని ఆయన పిలుపు నిచ్చారు.

మృతదేహం గుర్తింపు

మృతుడు కాకినాడ వాసిగా గుర్తింపు

కొవ్వూరు: పట్టణంలోని లాంచీల రేవు వద్ద గోదావరిలో కట్టా లోవరాజు(39) మృతదేహాన్ని సోమవారం మధ్యాహ్నం గుర్తించినట్టు పోలీసులు తెలిపారు. కాకినాడకి చెందిన లోవరాజు కాకినాడలో శ్రావణి ఆసుపత్రి ఎదురుగా మెకానిక్‌గా పని చేసుకుని జీవిస్తున్నాడు. చాలా కాలం నుంచి పెళ్లి కావడం లేదని తీర్థయాత్రకు వెళ్లి వస్తున్నాడు. నెల క్రితం తీర్థయాత్రకు వెళుతున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లాడు. సోమవారం కొవ్వూరులో లాంచీల రేవుల వద్ద గోదావరి నదిలో మగ శవం ఉందని తెలుసుకుని చూస్తే తన సోదరి మృతదేహంగా గుర్తించినట్లు మృతుడి సోదరుడు కట్టా వీరబాబు ఫిర్యాదు చేశాడు. మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు ఏఎస్సై జీజీ ప్రకాష్ తెలిపారు. వీరబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. లోవరాజు మృతికి గల కారణాలు ఏమిటనేది తెలియరాలేదన్నారు. ప్రమాదవశాత్తు నదిలో దిగి మునిగిపోయాడా, లేదంటే నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడా అన్న విషయం విచారణలో తెలాల్సి ఉందన్నారు.

బహిరంగ సభను జయప్రదం చేయాలి

చాగల్లు: అసమానతలు లేని ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్ట్(సీపీఎం) ఆంధ్రప్రదేశ్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం విజయవాడలో నిర్వహించే ప్రజారక్షణ భేరి రాష్ట్ర బహిరంగ సభను జయప్రదం చేయాలని సీపీఎం తూర్పుగోదావరి జిల్లా కమిటీ సభ్యులు ఎం.సుందరబాబు కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో బహిరంగ సభ పోస్టర్ ఆవిష్కరించారు.

జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



రాష్ట్ర జట్టుకు ఎంపికైన పల్లంట్ల జెడ్పీ హైస్కూలు విద్యార్థులు

దేవరపల్లి: అండమాన్ నికోబార్‌లో డిసెంబరులో జరగనున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) జాతీయస్థాయి టోర్నమెంట్‌కు దేవరపల్లి మండలం పల్లంట్ల జెడ్పీ హైస్కూలు విద్యార్థులు రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారు. కర్నూల్ జిల్లా ఎమ్మిగనూర్ ఇటీవల జరిగిన ఎస్‌జీఎఫ్ 67వ అంతర్ జిల్లాల ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ టోర్నమెంట్‌లో విద్యార్థులు బి.నాగవెంకట్, కె.బలరాం, టి.సంతోష్, ఎ.ప్రీతం, బి.శాలిని, ఎ.దీపిక, బి.భవాని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జట్టు తరఫున ఆడి ప్రతిభ చూపినట్టు పీడీ ఓరుగంటి రామకృష్ణంరాజు గురువారం తెలిపారు. వీరిలో టి.సంతోష్, బి.భవాని జాతీయస్థాయి టోర్నమెంట్‌కు రాష్ట్ర జట్టుకు ఎంపికై నట్టు ఆయన తెలిపారు. విద్యార్థులను ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కూచిపూడి సతీష్, సర్పంచ్ నూతలపాటి వెంకటరమణ, హెచ్ఎం వరలక్ష్మి, ఉపాధ్యాయులు అభినందించారు.

భూముల కౌలు హక్కునకు టెండరు-కమ్-బహిరంగ వేలం పాట ప్రకటన

[illegible]

క్ర. సం.	దేవాలయము పేరు	భూమి ఉన్న గ్రామము	విస్తీర్ణం ఎ.సెం	కౌలు కాల పరిమితి	వేలం జరుగు ప్రాంతము, తేది, సమయము
1	[illegible]	[illegible]	10.14	01.12.2023 నుండి 30.11.2026 వరకు	[illegible] 10.30ని
2	[illegible]	[illegible]	1.41	01.12.2023 నుండి 30.11.2026 వరకు	[illegible] 11.30ని

[illegible]

ఎ.రామ మోహనరావు మేనేజరు